సాక్షి సూర్యాపేట

మంగళవారం। 18। మార్చి। 2025



ఇస్రో పిలుస్తోంది

యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుంచి ఇస్రో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. - 8లో



ఇఫ్తార్ విందుకు నిధులు

రంజాన్ ఇఫ్తార్ విందు నిర్వహణకు ఉమ్మడి జిల్లాకు తెలంగాణ ప్రభుత్వం రూ.39లక్షలు విడుదల చేసింది. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (మంగళవారం సా॥)

సహర్ 5-00 (బుధవారం ఉ॥)

న్యూస్‌రీల్

ఆర్టీసీ సూర్యాపేట డిపో మేనేజర్ బదిలీ

- కొత్త మేనేజర్‌గా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ ముషీరాబాద్ డిపో–2కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలోకి భూపాలపల్లి డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.లక్ష్మీనారాయణ బదిలీపై వచ్చారు. ఈయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా డిపో పరిధిలో బస్సులు నడుపుతామన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



మాట్లాడుతున్న ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి అశోక్

సూర్యాపేట: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు యథావిధిగా కొనసాగించాలని ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి అశోక్ కోరారు. సోమవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయంగా పేరు మార్చడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్రుని విద్యాసాగర్‌రావు, బచ్చు పురుషోత్తం, నాయకులు బజ్జూరి శ్రీనివాస్, శీలా శంకర్, ఓరుగంటి సంతోష్, బిక్కుమల్ల సంతోష్, యామా సంతోష్, పాలవరపు నరసింహారావు, బెలిదె నాగేందర్, ఇమ్మడి సందీప్ పాల్గొన్నారు.

గోదావరి జలాలు ఏవీ?

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వారబందీ విధానంలో చివరి విడతగా సోమవారం నుంచి గోదావరి జలాలు విడుదల చేసామని నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించినా పునరుద్ధరించలేదు. రాత్రి వరకు కూడా నీటి విడుదల జరగలేదు. దీంతో రోజంతా గోదావరి జలాల కోసం అన్నదాతలు ఎదురు చూశారు. మంగళవారం కూడా నీళ్లు వచ్చే అవకాశం లేదని సమాచారం. నీటి పారుదలశాఖ అధికారులు ప్రకటించినా నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వరిపంటలు నీళ్లు చాలక ఎండిపోతున్నాయని, వెంటనే నీటిని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్ కమిటీల ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో నిర్వహించిన సర్వేలో తాము గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీక్షకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్య మాదిగ, జిల్లా నాయకులు ఎర్ర వీరస్వామిమాదిగ సంఘీభావం ప్రకటించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ దీక్షలో పార్టీ జిల్లా నాయకులు కోట గోపి, మట్టిపల్లి సైదులు, ఎల్గూరి గోవింద్, శేఖర్, మద్దెల జ్యోతి, రవి, వన్‌టౌన్ కార్యదర్శి సాయికుమార్, టూటౌన్ కార్యదర్శి నాగమణి, త్రీటౌన్ కార్యదర్శి యాదగిరి, రూరల్ మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, సైదమ్మ, మందడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తజనం

వైభవంగా వసంతోత్సవం

మునగాల: మండలంలోని రేపాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను ఊరేగిస్తూ గాంధోళి (వసంతోత్సవం)ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆనందోత్సహాలతో రంగులు చల్లుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి వేడకను తిలకించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సారిక చినరామయ్య యాదవ్, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తగ్గేదేలే..



కోదాడ పట్టణంలో కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం టెన్నికాయిట్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

నీటి తిప్పలు తీర్చేలా..

యుద్ధప్రతిపాదికన పాతబోర్లు, చేతి పంపుల మరమ్మతులు

- వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు
- ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- గుర్తించిన సమస్యలు 108.. పరిష్కరించినవి 54

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో ఎండలు ముదరడంతో నెలకొన్న మంచినీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏ ఒక్క ప్రాంతంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకు గాను జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రధానంగా జిల్లాలో మంచినీటి వనరులైన మిషన్ భగీరథ పైపులైన్లు, చేతి పంపులు, బోర్లతో పాటు, చిన్న పైపులైన్ల మరమ్మతులను అధికారులు యుద్ధప్రతిపాదికన చేయిస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం ఒక్కసారి మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. తదనంతరం వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రమాద ఘంటికలు మోగే పరిస్థితికి వచ్చాయి. మార్చి ప్రారంభంలోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోరుబావులు ఎండిపోయాయి. మిషన్ భగీరథ నీళ్లు చాలా ప్రాంతాలకు రావడం లేదు. ఈ నేపథ్యంలో యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో ఇప్పటికే అధికారులు గుర్తించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇటీవలే నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగిన సమీక్షలో కలెక్టర్ నీటి ఎద్దడి నివారణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ సైతం ఇచ్చారు.



ఆత్మకూర్‌లో మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాతవాటిని బాగుచేయిస్తూ..

ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఏ ప్రాంతంలో నీటి ఎద్దడి ఉంటుంది..? అక్కడ ఏ విధంగా సమస్యను అధిగమించవచ్చో అధికారులు నివేదికలు తయారు చేశారు. ఇందుకు అనుగుణంగా నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం అమలైన తర్వాత జిల్లాలోని కొన్ని పట్టణాలు, గ్రామాల్లో బోరుబావులను పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మళ్లీ వాటి అవసరాన్ని గుర్తించి పునరుద్ధరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఉన్న పాత బోరు బావులు, చేతిపంపులను సైతం పనిచేసేలా మరమ్మతులు చేస్తున్నారు. ఆవాసాల వారీగా నీటి సమస్య ఎక్కడ ఉందో గుర్తిస్తూ.. పైపులైన్లు పగిలిపోయిన చోట మరమ్మతులు చేపడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఇలా..

జిల్లా వ్యాప్తంగా 475 పంచాయతీల్లో బోరు బావులు, పైపులైన్లు, మోటార్లు, చేతిపంపులను గుర్తించి మరమ్మతులు ప్రారంభించారు. గుర్తించిన పనులన్నింటికీ దాదాపు రూ.4.35 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. ఇందులో చేతిపంపులు 658, సింగిల్ ఫేస్ మోటార్లు 82, 147 త్రీఫేస్ మోటార్లకు, 16 ఓపెన్ బావులు, 200 ప్రదేశాల్లో పైపులైన్లకు మరమ్మతులు అవసరమని గుర్తించారు. గుర్తించిన మరమ్మతుల్లో ఇప్పటికే సగానికి పైగా పూర్తయ్యాయి.

పది పరీక్షలకు 67 కేంద్రాలు

21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఎగ్జామ్స్

- అన్ని సౌకర్యాలున్న స్కూళ్లలోనే సెంటర్లు
- పరీక్ష రాయనున్న 11,912 మంది విద్యార్థులు

'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



కె. అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

సూర్యాపేట టౌన్: 'ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం' అని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. పలు వివరాలు ఆయన మాటల్లోనే..

అన్ని సౌకర్యాలు కల్పించాం..

జిల్లాలో మొత్తం 11,912 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలలను గుర్తించి వాటిల్లో 67 సెంటర్లను ఏర్పాటు చేశాం. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ద్రావణం, వడదెబ్బ, ఇతర అనారోగ్య కారణాలకు చికిత్సనందించేందుకు సెంటర్‌కు ఇద్దరు ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటారు. కేంద్రాల్లోనూ గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా గదులను కేటాయించాం. కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీటి వసతి అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేశాం.

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బందిని నియమించాం. మొత్తం 67 సెంటర్లకు 67 చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో పాటు 702 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. అలాగే పరీక్షలో విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 67 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. వీరు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు ఉన్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు..

ఈ నెల 21వ తేదీ నుంచి ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. మొత్తం ఏడు పరీక్షలు జరగనున్నాయి. సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి మాత్రమే రెండు పేపర్లు ఉంటాయి. అలాగే ఈ ఏడాది అడిషనల్ షీట్స్ కాకుండా 24పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రత్యేక పోలీస్ సిబ్బందితో ప్రశ్నపత్రాల చేరవేత, సమాధాన పత్రాల భద్రత చర్యలు చేపట్టనున్నాం. విద్యార్థులు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాలను చూసుకొని సమయానికి గంట ముందే చేరుకుంటే మంచిది.

సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయొచ్చు

విద్యార్థులు పరీక్షలకు సంబంధించి, ఇతర సమస్యలు ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ **8247809660**కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. అలాగే పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు అనుమతి లేదు.

బాధితులకు భరోసా కల్పించాలి

- ఎస్పీ నర్సింహా

సూర్యాపేట టౌన్: వివిధ సమస్యలపై పోలీస్ గ్రీవెన్స్ వచ్చే బాధితులకు భరోసా కల్పించి, న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.నర్సింహ ఆదేశించారు. సోమవారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉండాలని సిబ్బందికి సూచించారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహా

ఏజీపీగా ఎండీ షఫిఉల్లా

చివ్వెంల: అదనపు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా సూర్యాపేట పట్టణానినికి చెందిన సీనియర్ న్యాయవాది ఎండీ షఫిఉల్లాను నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ప్రభుత్వం తరపున భూ సమస్యలపై వాదనలు వినిపించనున్నారు. మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య ఉన్నారు.

హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచి పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి, కోదాడ మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. సోమవారం సూర్యాపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాసనసభలో ముఖ్యమంత్రి ఉపయోగించే పదజాలాన్ని ఖండించని మేధావులు రాష్ట్రంలో ఉన్నారంటే దిగజారుడు రాజకీయాలు కనిపిస్తున్నాయన్నారు. స్పీకర్‌ను జగదీష్‌రెడ్డి అవమానించి మాట్లాడినట్లు ఏ వీడియోల్లో లేదన్నారు. పదే పదే దళిత స్పీకర్ అంటూ కాంగ్రెసోళ్లే అవమానిస్తున్నారని పేర్కొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో వేల ఎకరాల్లో వరిపొలాలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, రాస్తారోకోలు చేయవద్దనడం దారుణమన్నారు. నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందన్నారు. ఈ నెల 20న సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. ఏప్రిల్ 27న జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ బహిరంగసభ విజయవంతంపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వై వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, బండారు రాజా, బూరబాల సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగయ్య యాదవ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కిషోర్, మల్లయ్య యాదవ్

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు 70 నుంచి 80 కిలోమీటర్ల దూరం నుంచి వారి సమస్యలు చెప్పడానికి ప్రజావాణికి వస్తున్నారని తెలిపారు. ప్రతి అర్జీని పరిశీలించి కచ్చితమైన సమాధానం తెలుపుతూ పరిష్కరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతి రావు పూలే భవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజావాణిలో జిల్లాకు చెందిన 36 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే జిల్లాస్థాయిలో ఉన్న 630 అర్జీలను సత్వరమే పరిష్కంచాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సకాలంలో హాజరు నమోదు చేసుకోవాలి

కలెక్టరేట్ సిబ్బంది ఫేస్ రికగ్నిజేషన్ (బయోమెట్రిక్) ద్వారా తప్పనిసరిగా ప్రతిరోజూ ఉదయం పదిన్నర లోపు, సాయంత్రం 5గంటల తర్వాత ప్రతిఒక్కరూ హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఆర్థిక సంవత్సరం చివరిలో ఉన్నందున అధికారులు తమ శాఖలకు సంబంధించిన కార్యాలయాలు మున్సిపల్, గ్రామ పంచాయతీలకు ప్రాపర్టీ టాక్స్ చెల్లించాలన్నారు. మార్చి 21 నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు ఉన్నందున స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఈఓ అశోక్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీటీడీఓ శంకర్, సీపీఓ కిషన్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా ఉంటా



సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, డైరెక్టర్లను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

భానుపురి (సూర్యాపేట): ఈ ప్రాంత రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటానని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి సూర్యాపేటలోని రవి మహల్‌లో సూర్యాపేట ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ చైర్మన్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డైరెక్టర్లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా వేణారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. దామోదర్‌రెడ్డి మంత్రి ఉన్నప్పుడు ఆర్యవైశ్యుల వ్యాపారాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. తమపై దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భయాన్ని తొలగిస్తూ.. ఉత్సాహం నింపుతూ..

- హైస్కూళ్ల సందర్శనకు పీఎస్, యూపీఎస్ విద్యార్థులకు అవకాశం
- చదువబోయే బడుల స్థితిగతులపై అవగాహన కల్పించేందుకు..
- 'ట్వీనింగ్ ఆఫ్ స్కూల్స్' పేరుతో విద్యాశాఖ కొత్త కార్యక్రమం

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువు పూర్తి చేసుకుని ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో భయం తొలగించి పైతరగతులు చదవాలనే ఆసక్తి పెంచుతూ వారిలో నూతనోత్సాహాన్ని నింపేలా రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. కొత్త బడి వాతావరణానికి అలవాటు పడడానికి 'ట్వీనింగ్ ఆఫ్ స్కూల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు దగ్గరలోని ఉన్నత, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలను సందర్శించి పరిశీలించేలా కార్యాచరణ రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 74 పాఠశాలల్లో అమలు చేస్తోంది.

పరిశీలన, అవగాహన..

ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అక్కడి తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ విద్యాబోధన, లైబ్రరీ, విద్యా శాఖ కార్యక్రమాల అమలు, క్రీడలు, క్రమశిక్షణ తదితరాలపై అవగాహన కల్పించనున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, సౌకర్యాలను పరిశీలించనున్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు చేరే పాఠశాలలను సందర్శించడంతో అక్కడి స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.



నాగారం బీసీ గురుకులాన్ని సందర్శించిన తొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, టీచర్లు

బోధన విని.. భోజనం చేసి..

ప్రారంభం నుంచి ఒకే బడిలో చదివి మరో పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థుల్లో ఒక రకమైన భయం ఉంటుంది. వారిలో భయం పోగొట్టి ఉన్నత పాఠశాలల్లో వసతులు, బోధనపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి ఒకరోజు మొత్తం అక్కడే ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తుండగా విద్యార్థులు ప్రత్యక్షంగా వింటున్నారు. అక్కడే మధ్యాహ్న భోజన వసతిని కల్పిస్తున్నారు. గతేడాది నుంచి అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొనసాగిస్తున్నారు.

అవగాహన పెరుగుతుంది



పాఠశాలలను క్షేత్ర స్థాయిలో సందర్శించడం వల్ల ఆయా పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుంది. ఉపాధ్యాయులపై నమ్మకం కలగడంతో అడ్మిషన్లు పెరగనున్నాయి. తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి.

– మురళి, హెచ్‌ఎం, తొండ ప్రాథమిక పాఠశాల

74 పాఠశాలల గుర్తింపు

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 74 పాఠశాలలను గుర్తించారు. ఇందులో ప్రాథమిక స్థాయి తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లి పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.50 చొప్పున రవాణా చార్జీలు విడుదల చేసింది. దీంతోపాటు విద్యార్థులు సందర్శించనున్న పాఠశాలల్లో చిత్రాలు, బ్యానర్ డాక్యుమెంటేషన్ కోసం రూ.500 చొప్పున సమగ్ర శిక్ష అభియాన్ నుంచి నిధులు సమకూరాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం


సందీప్ (ఫైల్)

నేరేడుచర్ల: బైక్‌పై వెళ్తున్న బీటెక్ విద్యార్థి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకీడు మండలం బెట్టెతండాకు చెందిన బండావత్ సందీప్(20) హైదరాబాద్‌లోని మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హోలి పండుగకు ఇంటికి వచ్చిన సందీప్ సోమవార నల్లగొండ జిల్లా హాలియాలో తన స్నేహితుడి వివాహానికి బైక్‌పై వెళ్తుండగా.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో చెరువు మూలమలుపు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్‌ను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి బండావత్ శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను తప్పించబోయి..


ప్రభాకర్ (ఫైల్)

రాజాపేట: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి రాజాపేట మండలం జాల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాల గ్రామానికి చెందిన చెవిటి ప్రభాకర్(32) ఆదివారం రాత్రి తనపై బైక్‌పై జాల మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లొస్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ప్రభాకర్ తలకు తీవ్రగాయాలు కాగా.. భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు..

డిండి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం డిండి మండలం హజ్యతండా సమీపంలో జరిగింది. వివరాలు.. డిండి మండలం శేషాయికుంటకు చెందిన ఇంజమూరి సాయి(22) తవక్లాపూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తతండాకు చెందిన జటావత్ శక్రునాయక్(55) తన బైక్‌పై చెర్కుపల్లి నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో హజ్యతండా సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయి, శక్రునాయక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజు తెలిపారు.

ఇస్రో పిలుస్తోంది

విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, పాఠశాల స్థాయిలోనే అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పనిచేస్తోంది. ఇందులో భాగంగా 2019 నుంచి ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఇస్రో చేస్తున్న ప్రయోగాలు, వాటి వెనుక దాగి ఉన్న కృషిని తెలియజేసి వారిలో స్ఫూర్తి నింపేందుకు యువికా తోడ్పడుతోంది. - నల్లగొండ, సూర్యాపేటటౌన్, హుజూర్‌నగర్

యువ విజ్ఞాన కార్యక్రమంతో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం


- ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 23 వరకు గడువు



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల వంద ప్రయోగాలు పూర్తి చేసుకుంది. అగ్రదేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష రంగంలో పరిశోధనలు చేపడుతోంది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను కూడా అంతరిక్ష ప్రయోగాల్లో భాగస్వాములను చేసేందుకు, వారికి అంతరిక్ష ప్రయోగాల గురించి తెలియజేసేందుకు యువికా ద్వారా సహాయ సహకారాలు అందజేస్తోంది. యువికాలో ఎంపికైన విద్యార్థులకు తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కేరళలోని తిరువనంతపురం, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, గుజరాత్‌లోని అహ్మదాబాద్, కర్ణాటకలోని బెంగళూరు, మేఘాలయలోని షిల్లాంగ్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యువికా–2025కు సంబంధించి దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గత నెల 24వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఈ నెల 23 వరకు గడువు ఉంది.

విద్యార్థుల ఎంపిక ఇలా..

8వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కులను 50 శాతం వెయిటేజీగా తీసుకుంటారు. అదేవిధంగా ఆన్‌లైన్ క్విజ్‌లో చూపిన ప్రతిభకు 10 శాతం వెయిటేజీ, ఇంతకు ముందు పాల్గొన్న జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఫేర్ (గత 3 సంవత్సరాలు)లకు 2, 5, 10 శాతం వరకు, ఒలింపియాడ్‌లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, ఆపై స్థాయిలో పాల్గొంటే 2, 4, 5 శాతం వరకు వెయిటేజీ ఇస్తారు. స్పోర్ట్స్‌లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొన్న వారికి 2, 4, 5 శాతం వరకు, స్కౌట్ అండ్ గైడ్స్/ఎన్‌సీసీ/ఎన్‌ఎస్‌ఎస్ వాటికి 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న విద్యార్థులకు 20 శాతం వెయిటేజీ తీసుకుని తుది జాబితాకు చేస్తారు.



ఎంపిక తేదీలు

మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. ఏప్రిల్ 7వ తేదీన తొలి జాబితాను విడుదల చేయనున్నారు. మే 18న ఇస్రో సూచించిన కేంద్రాల వద్ద రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మే 19 నుంచి 30 వరకు 2 వారాల పాటు ఎంపికైన విద్యార్థులకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట–ఆంధ్రప్రదేశ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్–తెలంగాణ, విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, తిరువనంతపురం–కేరళ, యుఆర్ రావు శాటిలైట్ సెంటర్, బెంగళూరు–కర్ణాటక, స్పేస్ అప్లికేషన్ సెంటర్, అహ్మదాబాద్–గుజరాత్, నార్త్–ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్–మేఘాలయ, ఐఐఆర్‌ఎస్, డెహ్రాడూన్–ఉత్తరాఖండ్‌లో ఎక్కడైనా ఒక చోట శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. ఎంపికైన విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి కూడా ప్రయాణ ఖర్చులు ఇస్రో చెల్లిస్తుంది. మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ప్రధానంగా అంతరిక్షం, సాంకేతికత, అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, అంతరిక్ష అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందిస్తారు. అంతరిక్ష కేంద్రాల్లో ప్రయోగశాల సందర్శన అక్కడి ప్రముఖ శాస్త్రవేత్తలతో సమావేశం, ముఖాముఖి చర్చలు, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

దరఖాస్తు చేసే విధానం

అధికారిక ఇస్రో వెబ్‌సైట్ www.isro.gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ ఓపెన్ చేసిన తర్వాత యువికా ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈ–మెయిల్ ఐడీ ద్వారా విద్యార్థికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం మెయిల్ ఐడీకి లింక్ వస్తుంది. ఈ లింక్ ద్వారా ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ స్పేస్ క్విజ్‌లో విద్యార్థి పాల్గొనాల్సి ఉంటుంది. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతి, విద్యార్థి గత మూడేళ్లలో వివిధ అంశాలలో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 1వ తేదీ నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగడానికి యువికా మంచి అవకాశం. ఇస్రో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి. పూర్తి వివరాలకు 98485 78845 నంబర్‌ను సంప్రదించాలి.

- బొల్లారం భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

ప్రయోగాల వైపు ప్రోత్సహించాలి



విద్యార్థులను చిన్నప్పటి నుంచే ప్రయోగాలు చేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఇస్రో చేపట్టిన యువికా అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలి. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు యువికాపై అవగాహన కల్పించాలి.

- దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి, సూర్యాపేట

గతంలో జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక



యువికా–2022లో దేశంలో 150 మందిని ఎంపిక చేస్తే తెలంగాణ నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. అందులో నల్లగొండ జిల్లా నుంచి రాహుల్ రంగనాథ్–డిండి మోడల్ స్కూల్, సానియా–నాగార్జునసాగర్ నవోదయ రెసిడెన్షియల్ స్కూల్, విజయ–నల్లగొండ కేంద్రీయ విద్యాలయం నుంచి ఎంపికై హైదరాబాద్‌లో రెండు వారాల పాటు శిక్షణ పొందారు.

- లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ

కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్య

- కాపుగాసి గొడ్డళ్లతో నరికిన గుర్తుతెలియని వ్యక్తులు


చక్రయ్యగౌడ్ (ఫైల్)

నూతనకల్: మండల పరిధిలోని మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్(65) సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. డీఎస్పీ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చక్రయ్యగౌడ్ సోమవారం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి వస్తుండగా ముత్యాలమ్మ గుడి సమీపంలో కొంతమంది కాపుగాసి గొడ్డళ్లతో అతడి తల, చేతులు, కాళ్లపై దాడి చేసి పక్కనే రోడ్డు పక్కన గోతిలో పడేశారు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో చక్రయ్యగౌడ్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజకీయ ఆధిపత్యంతోనే హత్య జరిగినట్లు డీఎస్పీ తెలిపారు. మృతుడి కుమార్తె అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ధ్వంసమైన లారీ ముందుభాగం

కేతేపల్లి: విజయవాడ – హైదరాబాద్ రహదారిపై కేతేపల్లి మండల కేంద్రంలో సోమవారం లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన లారీ సోమవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్లు, ఇనుప బారికేడ్లకు ఢీకొని డ్రైనేజీ కాల్వపై ఆగిపోయింది. ఈ క్రమంలో రోడ్డు పక్కన కొబ్బరి బొండాల దుకాణాన్ని ఢీకొట్టడంతో దుకాణం ధ్వంసమైంది. దుకాణ నిర్వాహకులు పక్కకు పరుగెత్తడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాహుల్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ ఇంజన్‌లో నుంచి పొగ, మంటలు రావటంతో అప్రమత్తమైన పోలీసులు నకిరేకల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. డ్రైవర్ మద్యం మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


వెంకటేశం (ఫైల్)

కనగల్: మండలంలోని బుడమర్లపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతిచెందాడు. కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన ప్రకారం.. కనగల్ మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన కడారి వెంకటేశం(45) ఆ గ్రామ మాజీ సర్పంచ్ పగిళ్ల యాదయ్య వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ వాగులో ఇసుకను లోడ్ చేసుకొని నల్లగొండకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో బుడమర్లపల్లి వద్ద ట్రాక్టర్ ట్రాలీ డోరు కొండి ఊడింది. ఇది గమనించిన వెంకటేశం మరో ట్రాక్టర్ డ్రైవర్ సాయంతో డోరును సరిచేస్తుండగా ట్రాక్టర్ ముందుకు కదిలింది. ట్రాక్టర్‌ను ఆపే ప్రయత్నంలో భాగంగా స్టీరింగ్ పట్టుకుని సీటులోకి ఎక్కుతుండగా వెంకటేశం కిందపడిపోయాడు. దీంతో ట్రాక్టర్ టైరు అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా శిబిరంలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

భువనగిరిటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన 48 గంటల ధర్నా సోమవారం ప్రారంభించారు. ఈ సదర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, సిలువేరు రమాకుమారి మాట్లాడుతూ ఐసీడీఎస్ పథకం అమల్లోకి వచ్చి 50 ఏళ్లు గడిచినా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారానికి నోచడం లేదన్నారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు వర్తింపజేయాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వడంతో పాటు ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఐసీడీఎస్‌కు నిధులు పెంచి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలన్నారు. మంగళవారం కూడా ధర్నా కొనసాగిస్తామన్నారు. సోమవార రాత్రి ధర్నా శిబిరంలోనే అంగన్‌వాడీలు నిద్రించారు. కార్యక్రమంలో యూనియన్, సీఐటీయూ నాయకులు సిద్ధమ్మ, సునీత, వసంత, ఉమా, పద్మ, ప్రమీల, షాహిదా, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు నిధులు విడుదల

- ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు రూ.39లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు



భువనగిరిటౌన్ : రంజాన్ పర్వదినం సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజక వర్గాలకు రూ.39లక్షలు విడుదల చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నియోజకవర్గాల వారీగా నిధులు ఇలా..

నల్లగొండ	రూ.5 లక్షలు
మిర్యాలగూడ	రూ.4 లక్షలు
దేవరకొండ	రూ.3 లక్షలు
నాగార్జునసాగర్	రూ.3 లక్షలు
నకిరేకల్	రూ.3 లక్షలు
మునుగోడు	రూ.3 లక్షలు
కోదాడ	రూ.4 లక్షలు
సూర్యాపేట	రూ.3 లక్షలు
హుజూర్‌నగర్	రూ.3 లక్షలు
తుంగతుర్తి	రూ.3 లక్షలు
భువనగిరి	రూ.3 లక్షలు
ఆలేరు	రూ.2 లక్షలు

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


అంజి (ఫైల్)

మేళ్లచెరువు: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి రోడ్డు పక్కకు రాగా లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన పెద్దారపు అంజి(27) పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం అంజి సోమవారం బైక్‌పై మేళ్లచెరువు మండలకేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేళ్లచెరువు మండల కేంద్రంలోని హోండా షోరూం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కకు రాగా.. మేళ్లచెరువు నుంచి కోదాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అంజి రోడ్డుపై పడిపోగా అతడి పైనుంచి లారీ వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహం జరిగినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ మైహోం పరిశ్రమకు చెందినది కావడంతో మృతుడి బంధువులు తమకు న్యాయం చేయాలని మైహోం పరిశ్రమ గేటు ఎదుట సోమవారం రాత్రి వరకు నిరసన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీకి తీవ్ర గాయాలు..

చౌటుప్పల్ రూరల్: రోడ్డు దాటుతున్న వలస కూలీని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడకు చెందిన చన్నం సురేష్(19) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కూలీగా పని చేయడానికి రెండు వారాల క్రితం వచ్చాడు. పరిశ్రమలో కూలీ పని లేకపోవడంతో తిరిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లడానికి ఆదివారం రాత్రి దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా.. విజయవాడ వైపు వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా యాదవరెడ్డి తెలిపారు.

ఆరుపదులు దాటినా తగ్గని ఉత్సాహం


షటిల్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు


చెస్ పోటీల్లో నువ్వా నేనా అంటూ..


క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

- కోదాడలో పోటాపోటీగా రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

కోదాడ: ఆరుపదుల వయస్సు దాటినా వారిలో ఉత్సాహం ఉరకలేస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తమలోని క్రీడానైపుణ్యాన్ని బహిర్గతం చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. రెండు రోజులుగా కోదాడలో జరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తమలోని క్రీడా ప్రతిభను చాటుతున్నారు. కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో సోమవారం రెండో రోజు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు టెన్నికాయిట్, షటిల్, క్యారమ్స్, చెస్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 33 జిల్లాల నుంచి 300 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, మంగళవారం సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, రిటైర్డ్ ఉద్యోగులు అక్కిరాజు వెంకట్రావ్, గాయం పట్టాభిరెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, విద్యాసాగర్, భ్రమరాంబ, రఘు, ఓరుగంటి రవి, గగ్గినపల్లి సుదర్శన్‌రెడ్డి, బాబురావు, మేకల వెంకటేశ్వరరావు, అరుణ పాల్గొన్నారు.

విజయ విహార్ ఆవరణలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న పర్యాటక సంస్థ సిబ్బంది

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ అతిథిగృహం ఆవరణలో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం విజయ విహార్ ఆవరణలో వివాహం జరిగింది. ఆ సమయంలో ఏర్పడిన చెత్తను తొలగించి ఒక దగ్గర చేర్చి సోమవారం సాయంత్రం తగలబెట్టారు. అందులో నుంచి గాలికి మండే విస్తరి ఒకటి లేచి ఆవరణలోని అటవీ ప్రాంతంలో భూమిపై ఎండిపోయిన గడ్డిపై పడడంతో మంటలు అంటుకొని కాలిపోయింది. పర్యాటక సంస్థ ఉద్యోగులు అతికష్టం మీద చెట్ల కొమ్మలతో, నీటితో మంటలను ఆర్పివేశారు. లేదంటే 10ఎకరాల మేర ఉన్న అటవీ ప్రాంతంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, పార్కులు తగలబడేవి.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


కవిత (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామ ంలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మహి ళ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన గోగుల కవిత(30) సోమవారం ఉదయం ఇంట్లో అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో భర్త సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె మృతికి తన అల్లుడు గోగుల కమలాకర్, అతడి తండ్రి కారణమని మృతురాలి తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కమలాకర్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన కుమార్తెను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కమలాకర్, అతని తల్లిదండ్రులు తన కుమార్తెను కొట్టి చంపి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

చోరీ చేసేందుకు వచ్చి ఆస్పత్రిపాలైన దొంగ

- గోడ దూకి పారిపోతుండగా రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి..

కోదాడరూరల్: చోరీ చేసేందుకు వచ్చిన దొంగ గోడదూకి పారిపోతుండగా రాళ్ల మీద పడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన సోమవారం కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో జరిగింది. కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ కాలనీలో నిర్మిస్తున్న చర్చిలో దొంగతనం చేసేందుకు సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కొందరు వచ్చారు. చర్చిలో కిటికీలు, డోర్లు చోరీ చేస్తుండగా శబ్దం రావడంతో ఆ చర్చికి కాపలదారులుగా ఉన్నవారు గమనించి వారిలో ఒకరిని పట్టుకున్నారు. మిగతా వారు పరారయ్యారు. పట్టుబడిన దొంగకు దేహశుద్ధి చేసి ఉదయం పోలీసులకు అప్పగిద్దామని తాళ్లతో కట్టేశారు. తెల్లవారిన తర్వాత దొంగ కట్లు విప్పుతుండగా అతడు వారి నుంచి తప్పించుకొని గోడదూకి పారిపోతుండగా.. గోడ పక్కన ఉన్న రాళ్లపై పడి తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అతడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చర్చి పాస్టర్ జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సూర్యాపేట జిల్లా సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనమాల యాకయ్య

సూర్యాపేట: తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2018, 2024 సంవత్సరాలకు గాను బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డుకు ఎంపిక పోటీలు నిర్వహించగా.. సూర్యాపేట సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్య 2018కి గాను బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యాకయ్య గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అవార్డు, నగదు పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16గంటలు పాటలు పాడి రికార్డు


రికార్డుల పత్రాలతో చింత వెంకటేష్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన చింత గణేష్ కుమారుడు చింత వెంకటేష్ మూడు అంతర్జాతీయ రికార్డులు సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నిర్వహించిన గాన లహరి కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొని 16 గంటల పాటు నిర్విరామంగా పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలంగాణ కోఆర్డినేటర్ ఎం. హారిక, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ రవికుమార్, ఎస్పీ నిర్మల, త్రినాథరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.